# వధుపరీక్ష

కన్నడమూలం: "సూరిహర్దళి"
తెనుగుసేత : శర్వాణి

రావుగారికి మళ్ళీ యవ్వనం తిరిగి వచ్చినట్టుగా వుంది, ఆయన సంబరం చూస్తే. ఉదయం నుండి ఒక్క నిమిషం కూడా తీరిక లేకుండగా ఉన్నారు. ఫొటోలన్నిటిమీది దుమ్మును శుభ్రంగా దులిపి గోడకి వేలాడదీసారు. గుమ్మానికి మామిడాకుల తోరణం కట్టి ఇటునుండటు చకచకా తిరుగుతున్నారు. పక్కింటికి వెళ్ళి సోఫాసెట్టుని కొడుకు రమేశ్‌తో కలిసిపట్టుకొచ్చారు. హాల్లో దానిముందు టీపాయి దాన్ని వేసి పెట్టారు. దానిమీద ఫ్లవర్‌వాజ్ వుంచి అందులో అప్పుడే విచ్చుకుంటున్న పూలగుత్తిని అమర్చారు. ఓ మూల బల్లమీద సువాసనలు వెదజల్లే అగరువత్తులు వెలిగించి వుంచారు. అన్నీ సరిగ్గా అమర్చానా లేదా అని పరిశీలించి చూసి సంతృప్తిగా నిట్టూర్చారు.



అలస టతో ఆయనకు గొంతు ఎండి పోయినట్టనిపించింది. మత్తటి సోఫా మీద కూర్చుని పిలిచారు.

"రాధా, ఓ కప్పు కాఫీ"

రావుగారి భార్య రాధమ్మగారికి్కడా తీరిక లేదు. జామూన్లు చేయాలి. సమొసాలు చెయ్యాలి. అన్ని వేడివేడిగా వేళకి అందివ్వాలి. గ్లాసులన్నీ శుభ్రంగా వుంచుకొని వాటిల్లో చిక్కటి పాలతో చేసిన కాఫీ కలిపివ్వాలి. లక్షాధికారులైన వాళ్లు అకస్మాత్ వంటింట్లోకి వచ్చి చూసినా ఎక్కడా మురికిగా ఉండకుండా చూసుకోవాలి. అంట్ల గిన్నెలు, చీపురు కట్ట, తుడిచే గుడ్డలు ఏమీ కనిపించకూడదు కదా.

ఆమె ఫ్లాస్క్‌లోంచి ఓ కప్పు కాఫీ గ్లాసులోకి పోసి తెచ్చి భర్త చేతికిచ్చారు. కాఫీ అందుకుంటూ రావుగారు అడిగారు "లక్ష్మి రెడిగా వుందా?"

లక్ష్మి అలంకరణ విషయంలో రాధమ్మగారు ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకున్నారు. "ముదురు రంగు, డాబుగా వున్న చీర కట్టుకోకే" అని హెచ్చరించి గులాబి రంగు పట్టు చీర, మ్యాచింగ్ జాకెట్టు తీసి వుంచారు.

"తల్లో బోలెడు పూలు తురుముకోక, మొహానికి పెయింట్ రాసినట్టు స్నో పౌడర్లు రాసుకోవద్దు. బొట్టు మరీ పెద్దది కాదు, మరీ చిన్నది కాకుండా వుండాలి." అని రకరకాలుగా హెచ్చరికలు చేశారు. రావుగారు కూడా సలహాలు ఇవ్వడంలో ఏమీ తీసిపోలేదు.

"మర్యాదస్తుల పిల్లలాగా నడచుకో తల్లి. చిన్న గొంతుతో మాట్లాడు. తల వంచుకునే వుండు. ఏమైనా అడిగితే వినయంగా జవాబు చెప్పు. దురుసుగా మాట్లాడకు" అంటూ.

విని, విని లక్ష్మి బుర్ర వేడెక్కిపోయింది. ఇవ్వాళ తనని చూట్టానికి వచ్చే వర మహాశయుడు ఎం. బి.బి.యస్ చదువాడుట. అందగాడుట. శ్రీమంతుడట.

రమేశ్ కూడా తన చెల్లెల్ని ఏడిపించే అవకాశాన్ని వదులుకోలేదు. తండ్రికి సాయం చేస్తూ, తల్లికి సలహాలిస్తూ మధ్యలో అలంకరించుకుంటున్న చెల్లి దగ్గరికి వచ్చి ఏదో ఓ కొంటెమాట ఆడి పరుగుతీసే వాడు.

"ఇవ్వాళ మనింటికి వస్తున్న ఆ మహానుభావుడు నల్లగా తుమ్మమొద్దులా వుంటాడుట. ఎం. బి.బి.యస్ చదివినా ఎక్కాలు కూడా రావుట......" ఇలా గేలి చేస్తూ నవ్వుకుంటూ వున్నాడు.

ఆ యింట్లో పనీపాట లేకుండా కూర్చున్న మనిషి అంటే రావుగారి తల్లి ఒక్కరే. డెభై ఏళ్ళ పండు ముసలి ఆమె. ఈ కొత్తరీతుల్ని ఇముడ్చుకోలేక ప్రతిఘటించే ఓపిక లేక మనస్సులోనే కుళ్ళిపోయేవారు. రావుగారు ప్రొద్దుటే ఆమెను హెచ్చరించారు. "అమ్మా, నువ్వు ఏమీ మాట్లాడక. ఊరికే కూర్చుని వుండాలి సుమా. వస్తున్న వారు పెద్ద మనుషులు. ఫారిన్ వెళ్ళి వచ్చినవారు. మధ్యలో ఏదైనా మాట్లాడి అభాసు చెయ్యక" అంటూను.

అందంగా తయారయిన మనవరాల్ని చూసి కూడా ఆమె సంతోషించలేదు. నాటకాల్లో వచ్చే నాట్యగత్తెలు ఇలాగే రంగుపూసుకుని ఆడంబరంగా తయారవుతారని ఆమె నమ్మకం. కేవలం రూపం చూసి పెళ్ళి చేసుకున్న మగాడు ఎన్ని రోజులు భార్యను ప్రేమించగలడు? ఒకరో, ఇద్దరో పిల్లలు పుట్టాక లావణ్యం తగ్గిన భార్యను వదిలి అదే మగాడు మరో సీతాకోక చిలుక వెంటబడడూ? రూపం ఉన్నది హృదయంలో.

అప్పుడప్పుడూ దగ్గుతూ వీళ్ళు చేస్తున్నదంతా చూస్తున్న ఆమెకి వీళ్ళ ఆడంబరాలు నవ్వు తెప్పిస్తున్నాయి. ఒక పెళ్ళి చేయడానికి ఇంత హడావిడా. మా కాలంలో పిల్లవాడు అమ్మాయిని చూసే పని కూడా లేదు. పదో ఏట అమ్మా నాన్న తమ పెళ్ళి చేసినప్పుడు అదికూడా ఓ బొమ్మలాట లాగే అనిపించింది. కాని తాము కాపురం చేసుకొని పిల్లల్ని కని పెంచలేదా? ఇప్పుడు ఓ పెళ్ళికి ఇంత సర్కస్ చెయ్యాలా.

ఆమె ఒకటే నిర్ణయానికి వచ్చారు. "'కాలం చెడిపోయింది."

అందంగా తయారయిన మనవరాల్ని చూసి కూడా ఆమె సంతోషించలేదు. నాటకాల్లో వచ్చే నాట్యగత్తెలు ఇలాగే రంగు పూసుకుని ఆడంబరంగా తయారవుతారని ఆమె నమ్మకం. కేవలం రూపం చూసి పెళ్ళి చేసుకున్న మగాడు ఎన్ని రోజులు భార్యను ప్రేమించగలడు? ఒకరో, ఇద్దరో పిల్లలు పుట్టాకా లావణ్యం తగ్గిన భార్యను వదిలి అదే మగాడు మరో సీతాకోక చిలుక వెంటబడడూ? రూపం ఉన్నది హృదయంలో. ఆమె మెల్లిగా గొణుక్కున్నారు "గదిలో దీపం ఆర్పాకా అందరాడవాళ్ళు ఒకటే!"

ఇంతలో రమేశ్ గొంతు వినిపించింది. "నాన్నా వాళ్ళు వచ్చారు". ముసలమ్మ తప్ప అందరూ బయటికి వచ్చారు. రావుగారు అప్పుడే ఆగిన కారు తలుపు తెరచి పట్టుకుని "రండి, ప్రయాణం సుఖంగా జరిగిందా కదా" అని పలకరించారు. "ఇంట్లోకి దయచేయండి" అని స్వాగతం పలికారు. లోపలికి వచ్చాకా "కూర్చోండి" అని సోఫా చూపించారు. రమేశ్‌కి అందరికీ చల్లని టూరినో తెచ్చిపెట్టమని సైగ చేశారు.

లక్ష్మి ఓ రకమైన సంభ్రమంలో మునిగి తేలుతోంది. ఉద్వేగంతో సన్నగా కంపిస్తోంది. తన కలలకు రూపం ఇవ్వడానికి ప్రయత్నిస్తోంది.

వాళ్ళు వచ్చినవారు ముగ్గురు. వరుడు, తల్లి కమలమ్మ, పేరయ్య శాస్త్రి గారు అంతే. వరుడి పేరు ఆనంద్ అని విన్నది లక్ష్మి. అతడికి తండ్రి లేడు. ఇంట్లో, బయటా వ్యవహారాలన్నీ తల్లే స్వయంగా చూసుకుంటుంది మగవాళ్లకన్నా ఎక్కువ నేర్పు గలది అని విన్నది.

'తీసుకోండి' అంటూ రావుగారు వచ్చిన వారికి చల్లని టూరినోలు అందించి తమ ఇంట్లోని వాళ్ళని పరిచయం చేశారు. "ఈమె నా భార్య రాధ. ఇతడు నా ఏకైక పుత్రరత్నం రమేశ్. ఈ మె ఎనిమిది మంది పిల్లలని కని పెంచిన నా తల్లి. మరి నేను."

శాస్త్రిగారు రావుగారి మాటల చిరుహాస్య ధోరణికి చిన్నగా నవ్వారు. వరుడు తల్లి గంభీరపు ముద్రను సడలించనే లేదు.

వర మహాశయుడు ఇదేదో తనకి సంబంధించిన వ్యవహారం కాదన్నట్టు డ్రింకు త్రాగడంలో నిమగ్నుడయ్యాడు.

కమలమ్మ శాస్త్రిగారితో అన్నారు "త్వరత్వరగా తెమల్చండి....... మనమింకా చాలా చోట్లకి వెళ్ళాలి" అంటూ.

శాస్త్రిగారు తిన్నగా వ్యవహారంలోకి దిగారు. "అయ్యా, కుర్రాడు చాలా బుద్ధిమంతుడు. ఎం. బి.బి..యస్ లో సెకెండ్ ర్యాంక్! లక్షలకు విలువ చేసే ఆదాయం వచ్చే బిజినెస్ వుంది. తండ్రికి ఏకైక తనయుడు"

"సంతోషం" అన్నారు రావుగారు,

రాధమ్మగారి మనస్సులోనే ఆమాట అనుకున్నారు. రమేష్ గదిలోకి వెళ్ళి చెల్లెలి బుగ్గ గిల్లి "ఎంత అందంగా వున్నవు చెల్లాయి. నిన్ను ఆ ఒంటికొమ్ము ఖడ్గమృగం చేతుల్లో పెట్టడం ఎలాగే" అంటూ ఏడిపించాడు.

వరుడి తల్లి "అమ్మాయిని చూపించెయ్యండి" అన్నారు. రావుగారి కనుసైగతో రాధమ్మగారు వెళ్ళి తలవంచుకున్న లక్ష్మిని తీసుకొచ్చి చాపమీద కూర్చోపెట్టారు.

"నీ పేరేమిటమ్మా" అన్నారు కమలమ్మ. లక్ష్మి తనకే వినిపించనంత నెమ్మదిగా తన పేరు చెప్పింది. "తలెత్తి మాట్లాడమ్మాయి. మేము నీ మొహం చూడొద్దూ?" అన్న ఆవిడ మాటలకు మెల్లిగా తలెత్తి ఆమెవేపు చూసి వరుని వేపు ఓరగా చూసి వెంటనే దృష్టిని తన కాలి బొటనవేలి మీద నిలిపింది.

"వరుడు అందగాడే" అనుకుంది. లేత మీసాలు సినిమా నటులకన్నా చిన్నవయస్సు. అందంగా దువ్విన క్రాపు. మొహానికి కాస్త పెద్దదైన ముక్కు..... దాంతో పాటు అతని మెడని అలంకరించే స్టెతస్కోపుని కూడా ఊహించుకున్న లక్ష్మి ఊహలు మరింత రంగుల మయమైనాయి.

"ఏమిటమ్మాయి. జవాబు చెప్పు" కమలమ్మగారి ప్రశ్న లక్ష్మిని కలల్లోంచి బయట పడేసింది.

"నీకు ఇంటిపనులు, కుట్టుపన్లు ఏమైనా వచ్చా"?

లక్ష్మి మాటలకోసం తడుముకుంటూ ఉండగానే రాధమ్మగారు అందుకున్నారు "పెయింటింగ్ వచ్చు. అదిగో గోడమీదున్న రాధాకృష్ణుల బొమ్మ తనే వేసింది. వంటవార్పు అన్నీ బాగా వచ్చు.' '

"తననే జవాబు చెప్పనివ్వండి. మధ్యలో మీరెందుకు మాట్లాడుతారు" అంటూ తమ అసంతృప్తి వ్యక్తపరిచింది వరుడు తల్లి. "పాడటం వచ్చా నీకు? ఓ కీర్తన పాడు" అన్నారు.

లక్ష్మి "చూసితినిపుడే గోపాలుడిని......" అంటూ శ్రావ్యంగా పాడింది. మధురమైన కంఠధ్వని వాతావరణాన్నంతటిని ఆవరించి మై మరచేలా చేసింది.

---

ఇదెలాటి వధుపరీక్ష? రావుగారి తల్లి మనస్సులోనే అనుకున్నారు. "కాపురం చేసుకోటానికి ఈ హంగులన్నీ ఎందుకట? రాను రాను వీళ్ళకు పిచ్చి ముదిరి పోతోంది" అనుకున్నారు. తమ కొడుకు ముందుగా హెచ్చరించనట్లయితే ఆమాటే పైకి అనేవారు కూడా. ఆమె జ్ఞాపకాలు ఏభైఏళ్లు వెనక్కివెళ్ళాయి. "ఓమాట చెబుతానే శంకరి. ఆడది సుఖంగా కాపురం చేసుకోవలంటే భర్తని ఖుషీగా వుంచాలి. దానికి మూడు మార్గాలున్నాయి. మొదటిది ఎప్పుడూ నవ్వు మొహంతో భర్తని పలకరించు. బయట తిరిగే మగవాళ్ళు అక్కడి చికాకుల్నంతా తమ భార్యలమీద చూపటం వాళ్ళ స్వభావం. అప్పుడు భార్య కూడా విరుచుకు పడితే ఇహ సంసారం వీధుల్లో పడ్డట్టే. కొంత సేపటికి తమ తప్పు తెలుసుకుని వాళ్ళే ఓదారుస్తారు."

లక్ష్మి పాడటం ఆపగానే శాస్త్రిగారు "భేష్" అన్నారు. రావుగారు మెప్పుగా తలవూపారు. వరుడు నిర్లిప్తంగా వున్నాడు. కమలమ్మగారు బింకంగా నీ జుట్టు నిజంగా అంత పొడు వుందా? లేక సవరమా?" అన్నారు.

"లేదండి తన జుట్టు వున్నదే అలాగ" మోకాలి వరకూ వేలాడుతున్న కూతురిజడ చూస్తూగర్వంగా చెప్పారు రాధమ్మ.

కమలమ్మ "కాస్త విప్పండి చూద్దాం" అన్నప్పుడు మాత్రం రాధమ్మ తెల్లబోయారు తరవాత తేరుకుని కూతురిని నిలబెట్టి జడ విప్పారు. పట్టులాంటి జుట్టు ఫ్యాన్ గాలికి అల్లల్లాడింది.

"మొహం కడుక్కురావమ్మా లక్ష్మి.... అంత ఫౌడర్ రాసుకున్నావు. మొహంలో ఏదైనా మచ్చలున్నాయేమో చూద్దాం" కాబోయే అత్తగారి మాటలు విని లక్ష్మి వళ్ళు జలదరించింది. అయినా ఎదురు జవాబు చెప్పకుండా తల్లివేపు చూసింది. కనుసన్నల మేరకు బాత్‌రూం వేపు వెళ్ళింది.


రావుగారి తల్లి మళ్ళీ తమ గత జీవనపు జ్ఞాపకాలల్లో మునిగిపోయారు. "భర్త హృదయాన్ని చేరుకునే సులభమైన దారి - అతని 'జిహ్వ.' అతడికి ఇష్టమైనదేదో కానిదేదో తెలుసుకుని వంటవార్పు శుచిగా వండిపెట్టు. ఎప్పటికీ నీకు విధేయుడిగా వుంటాడతను. ఆఖరిగా ఓమాట ఏ సంకోచమూ, సందేహమూ పెట్టుకోకుండా అతడిదరి చేరు. గుర్తుంచుకో ఇంట్లోనే అతని దేహము, మనస్సు తృప్తి పొందితే, అతడు మరో సీతాకోకచిలక వెనకాల పడడు."

తల్లి చెప్పిన మాటల్ని అక్షరాలా పాటించి సుఖంగా కాపురం చేసుకున్నారు శంకరమ్మ. ఆమె కాలంలో కుట్టుపనులు, అలంకార సామాగ్రి వీటి బెడద లేదు.

లక్ష్మి పొంగి వస్తున్న దుఃఖాన్ని ఆపుకుంటూ సబ్బుతో మొహాన్ని రుద్దుకుని శుభ్రంగా కడుక్కుంది. టవల్‌తో తుడుచుకుంటూ వెను తిరిగే సరికి అక్కడ కమలమ్మ నుంచుని వున్నారు. ఇహ దుఃఖం ఆపుకోలేక గబగబా తన గదిలోకి వెళ్ళి బోర్లాపడుకుని ఏడవ సాగింది. కమలమ్మ హాల్లోకి వచ్చి తమ స్థానంలోకి వచ్చి కూర్చుని శాస్త్రిగారి చెవిలో ఏదో చెప్పారు. ఆయన రావుగారితో "మీ అదృష్టం బాగుంది రావుగారూ, అమ్మాయి వాళ్లకి నచ్చింది. ఇహ మిగతా విషయాలు మాట్లాడుకోవచ్చు" అన్నారు.

రావుగారు వరుడి తల్లివేపు చూశారు. ఇక్కడ సర్వాధికారాలు ఆమెవే కదా!

"చూడండి మా అబ్బాయిని ఎం.బి.బి.యస్ చదివించడానికి ఆరు లక్షలు ఖర్చు పెట్టాము. వాడు ర్యాంక్ తెచ్చుకున్నందువల్ల ఖర్చు పెట్టడం సార్థకమయిందనుకోండి. కాని చదువు యింతటితో ఆపెయ్యటం మాకిష్టంలేదు. పై చదు






వుల కోసం అమెరికా పంపిద్దా మనుకుంటున్నాం. ఎంత కాదనుకున్నా నాలుగేళ్ల చదువుకి మూడు లక్షలు ఖర్చవుతాయి......" పక్కా వ్యాపారస్తులలాగా కమలమ్మ అన్నారు. "కాని ఆ ఖర్చు భరించడం మీ బాధ్యత, ఎంతయినా మీ అల్లుడు కోసమే కదా. ..."

రావుగారు బదులు చెప్పలేదు. తాము ఎంతవరకు తూగగలమా అని మనస్సులోనే లెక్కలు వేయసాగారు.

"ఫారిన్ రిటర్న్‌డ్ డాక్టరు అన్నాక ఏమారు మూల సందులోనో క్లినిక్ తెరిస్తే ఏం బాగుంటుంది? మేము జె.పి. నగర్‌లో ఓ స్థలం కొని వుంచాము. ఇక నాలుగేళ్ళలో అంటే అమెరికా నుంచి అబ్బాయి తిరిగి వచ్చేసరికి ఓ వంద పడకల నర్సింగ్ హోమ్ కట్టించే బాధ్యత మీదే....." అంటూ కమలమ్మగారు రావుగారి వేపు చూశారు.

శాస్త్రిగారు అందుకుని "మంచి ఆస్పత్రి అన్నాక ఇంపోర్టెడ్ ఎక్విప్‌మెంట్ వుంటేనే బాగుంటుంది. కూతురికోసం ఆ మాత్రం మీరు చెయ్యారా అనుకుంటున్నారు అమ్మగారు" అన్నారు.

రావుగారు పూర్తిగా క్రుంగి పోయారు. తమ ఆస్తిపాస్తులతోబాటు తమనే అమ్ముకున్నా వాళ్ళ కోరికల్ని పూర్తిచెయ్యటం అసాధ్యమనిపించింది ఆయనకు. రాధమ్మగారికి తమని పాతాళంలోకి తోసేసినట్టుగా అనిపించింది. లక్ష్మికి కంపరం పుట్టుకొచ్చింది. లేచి వెళ్ళి మొహంమీదే ఏదైనా అనేద్దామా అనిపించినా అది కూడా అనవసరం అనుకుని లేచి చీర మార్చి నైటీ తొడుక్కుంది.

కమలమ్మ చెప్పారు. "చూడండి, మనం ఇవ్వాళో రేపో పోయేవాళ్లం. మీరు ఇవన్నీ చెయ్యడం మీ కూతురు, అల్లుడు వాళ్ళకి పుట్టే పిల్లల కోసమే కదా. మీ అల్లుడు నాలుగైదు ఏళ్ళలో దీనికి పదిరెట్లు ఎలాగు సంపాదిస్తాడు.

శాస్త్రిగారు "ఇలాంటి సంబంధం దొరకడం మీరు పూర్వ జన్మలో చేసుకున్న సుకృతం అనుకోండి..... ఇవన్నీ మీకిష్టమైతే చెప్పండి. వెంటనే తాంబూలాలు పుచ్చేసుకుందాం. మీ అల్లుడు ఫారిన్ నుంచి రాగానే పెళ్ళి ముహూర్తాలు పెట్టుకోవడమే తరువాయి......"

రావుగారి వద్దనుండి ఎటువంటి ప్రతిక్రియ కానరాలేదు. ఆడపెళ్ళివారు వెనకాడుతున్నారని కమలమ్మగారికి అర్థమైంది. "మీకిష్టం లేకపోతే చెప్పండి. ఆడపిల్లలకేం లోటులేదు. కో అంటే కోటిమంది" అన్నారు దర్పంగా.

ఇంతదాకా మౌనంగా వున్న రావుగారు తల్లి యిప్పుడు నోరు విప్పారు. నిమ్మదిగా "మీరేమీ అనుకోకపోతే నేనొక మాట అడగవచ్చా" అన్నారు.

"ఓ, తప్పకుండా, మీరు పెద్దవారు, తెలిసిన వారు అడగండి" అన్నారు శాస్త్రిగారు. రావుగారు, తల్లిని వారించాలన్న ధ్యాస కూడా లేకుండా నిమ్మకునీరెత్తినట్టుగా వుండిపోయారు.

"ఇప్పుడు కాలమా చెడిపోయింది. ఏవేవో కొత్తజబ్బులు పుట్టుకొస్తున్నాయి. ఖూనీలు, దోపిడి, ఆక్సిడెంట్లు వీటికైతే లెక్కేలేదు...... ఈ ముసల్ది చెప్పేది నిజమా, కాదా?"

"నిజం, నిజం" అన్నారు శాస్త్రిగారు. కమలమ్మగారు మాట్లాడలేదు.

నేను ఎందుకు ఇలాగా చెబుతున్నానంటే, నాలుగేళ్ళ తర్వాత పెళ్ళి అంటున్నారు. ఏదైనా అటూ ఇటూ అవుతుందనుకోండి, అబ్బాయి చనిపోయడనుకోండి, అలా అవ్వాలని నేను చెప్పడం లేదు సుమా. హఠాత్తుగా అకస్మాత్ అయితే, గియితే.... మాటవరసకడుగుతున్నా...... మరి శవ సంస్కారం ఖర్చులు మీరు పెట్టుకుంటారా, మేము పెట్టుకోవాలా....." ఆమె మాటలు పూర్తయ్యేసరికి దానికి జవాబు చెప్పడానికి అక్కడెవరూ కనపడలేదు. కొడుకువేపు తిరిగి ఆమె ప్రశ్నించారు.

"నేను అడిగినదాంట్లో తప్పేమయినా వుందా బాబూ?"

రావుగారు నోటితో ఏమీ అనలేదు కాని "లేదమ్మ లేదు సరిగ్గానే అడిగావు" అంటున్నాయి రావుగారి కళ్ళు, మనస్సు కూడా.

